

## దివ్యాంగులందరికీ న్యాయం చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 5 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని దివ్యాంగులకు సొంత ఇండ్లు, 5 శాతం రిజర్వేషన్ కల్పించి ఆర్థిక సాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ ప్రతిభావంతుల దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని పలు రకాల దివ్యాంగులమైన తాము ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలులేక, సొంత ఇండ్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమకు ప్రభుత్వ స్థలం గుర్తించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. లేక ఇప్పటికే నిర్మించి ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త రేషన్‌కార్డులు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగులందరికీ త్వరలోనే న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీనిచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రతిభావంతుల దివ్యాంగుల సేవా సంఘం నాయకులు కిరణ్‌గౌడ్, కె.గణేశ్, జంగయ్య, అశోక్, మహేశ్, భాను ప్రకాశ్, రామచంద్రయ్య, భాస్కర్, పాండుయాదవ్, శేఖర్, దివ్యాంగులు ఉన్నారు.

## పంచాయతీ సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణీ



సిబ్బందికి నిత్యావసరాలను అందజేస్తున్న కార్యదర్శి

మంచాల, ఏప్రిల్ 5 : మంచాల గ్రామపంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు శుక్రవారం గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్ సబ్బులు, నూనె, శానిటైజర్‌తో పాటు నిత్యావస సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సిబ్బంది కృషి ఎంతగానో ఉందని అన్నారు. నిరంతరం గ్రామంలో చెత్తసేకరణ, రోడ్లతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం



నవీన్ (ఫైల్)

కడ్తాల్, ఏప్రిల్ 5: పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కడ్తాల్ ఠాణా పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ వరప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మన్నె నవీన్ (36) స్థానికంగా ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఏప్రిల్ 1వ తేదీన మిర్చి బండి నడిపేందుకు కేశంపేట గ్రామానికెళ్లాడు. అప్పటి నుంచి అతడు తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన భార్య శైలజ చుట్టు పక్క ఇండ్లతోపాటు.. తెలిసిన వారు.. బంధువుల ఇండ్లల్లో వాకబు చేసినా ఫలితం లేక పోవడంతో శుక్రవారం ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

కడ్తాల్, ఏప్రిల్ 5 : దాడి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఫిబ్రవరి 27న పెద్దవేములోనిబావి తండాకు చెందిన రమావత్ రాజేందర్‌పై దేవ్యా, మల్లేశ్ కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం దేవ్యా, మల్లేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మహేశ్వరం కోర్టులో హాజరు పర్చి.. అక్కడి నుంచి చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

## భవనం పైనుంచి పడి కూలీ మృతి

కొండాపూర్, ఏప్రిల్ 5 : ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుల్‌మోహర్ పార్కు సమీపంలో కెండ్యూర్ సంస్థ నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన పనుల్లో వెస్టు బెంగాల్‌కు చెందిన కైరుల్ మియా (34) కూలీగా పనిచేస్తున్నాడు. అతడు 30వ అంతస్తులో పనులు చేస్తూ.. ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో అతడు ప్రమాద స్థలంలోనే మరణించాడు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### కార్మికుల సేఫ్టీ గాలికొదిలేసిన కెండ్యూర్

కెండ్యూర్ నిర్మాణ సంస్థ కార్మికుల రక్షణ చర్యలను గాలికొదిలేసిందని అక్కడ పనిచేస్తున్న కార్మికులు వాపోయారు. 50 అంతస్తులతో భవనాలను నిర్మిస్తున్నప్పటికీ, కార్మికులకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఓ ప్రాణం పోయిందని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి సంస్థ అండగా నిలుస్తుందని యాజమాన్యం హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఇకనైనా రక్షణ చర్యలు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేశారు.

# జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

**పట్టణ, గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి**

**నివాళులర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు**



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 5: దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, దళిత, ప్రజాసంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, దళిత సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, బస్వం, జమృత్‌ఖాన్, పురుషోత్తంరెడ్డి, అశోక్, సీతారాం, మురళీమోహన్, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నంరూరల్ :** ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కౌన్సిలర్లు ఆకుల యాదగిరితో పాటు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, దళితసంఘాల నాయకులు ఇబ్రహీంపట్నం మార్కెట్‌యార్డు సమీపంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

**తుర్కయాంజాల్ :** మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణరెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

**చేవెళ్ల రూరల్ :** చేవెళ్ల మండల పరిధిలోని రేఘడిగణాపూర్, పామెన, ఆలూర్ తదితర గ్రామాల్లో స్థానిక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సరళ విజయ్‌కుమార్, నేతలు రాములు, రాంబాబు, నర్సింహులు, శ్యాంసుందర్, నరేందర్, బి.వెంకటేశ్, జంగయ్య, బేగరి రవి, బేగరి మహేందర్, బేగరి బాబురావు, మామిడిపల్లి బాబు, రవీందర్, రాజేందర్, కృష్ణ, జంగయ్య, రాజు, విజయ్‌కుమార్, బాల్‌రాజు, కృష్ణ, శంకర్‌బాబు, రాజు, ప్రశాంత్‌కుమార్, మల్లేశ్, యాదయ్య పాల్గొన్నారు.



చేవెళ్ల రూరల్ : రేఘడిగణాపూర్‌లో..

**పెద్దఅంబర్‌పేట :** పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ అశోక్‌కుమార్, మేనేజర్ బి.కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

**మంచాల :** మంచాల మండలం ఆరుట్ల, మంచాల తదితర గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, రాజ్‌కుమార్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



తుర్కయాంజాల్ : ఇంజాపూర్ చౌరస్తాలో..

**జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలి**

కడ్తాల్ : స్వాతంత్ర సమరయోధుడు, దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్జీవన్‌రామ్ యువజన సంఘం అధ్యక్షుడు ముసిలి మహేశ్ అన్నారు. శుక్రవారం కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్, లక్ష్మయ్య, వెంకటేశ్, శివరాజ్, రాజశేఖర్, అశోక్, రామకృష్ణ, శ్రీను, శ్రీకాంత్, అంజయ్య, షరీఫ్, సత్యం, రమేశ్, రాజేశ్, మల్లయ్య, భిక్షపతి, రామచందర్‌నాయక్, సాయిలు, కుమార్ తదితరులు ఉన్నారు.

**షాబాద్ మండలంలో..**

షాబాద్ : షాబాద్ మండలంలోని నాగరగూడ, షాబాద్ తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులున్నారు.

**చేవెళ్ల సహకార సంఘం ఆధ్వర్యంలో..**

చేవెళ్లటౌన్ : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, నాయకులతో కలిసి చేవెళ్లలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు టేకులపల్లి శ్రీనివాస్‌యాదవ్, యాదయ్య, మాజీ వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి, చేగూరి మల్లారెడ్డి నాయకులు ప్రభులింగం, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో..**

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సామాజిక జన జాగృతి సమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక జన జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.బాబు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు జగన్, శంకర్‌గౌడ్, లింగస్వామిగౌడ్ ఉన్నారు.

**ఆమనగల్లు :** మండలంలోని అంబేద్కర్ యువజన సంఘం మరియు వివిధ సంఘాల ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వి.మహేశ్, ప్రజా సంఘాల నాయకులు రమేశ్, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, బీజేపీ నాయకులు గోరటి నర్సింహ, కృష్ణ యాదవ్, లక్ష్మణ్, రాములు, మల్లేశ్, జి.భరత్ పాల్గొన్నారు.

**యాచారం :** మండలంలోని యాచారం, గున్‌గల్ గ్రామాల్లో జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**మొయినాబాద్ :** మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని హిమాయత్‌నగర్ అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పి.భీంభరత్ ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్‌లు వీరభద్రస్వామి, వెంకట్‌రెడ్డి, నాయకులు అశోక్‌యాదవ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శేఖర్, సంఘం సభ్యులు శ్రీనివాస్, రవియాదవ్ పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు జి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు.



షాబాద్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దఅంబర్‌పేట : మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు సిబ్బంది



ఇబ్రహీంపట్నంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

## నేడు సర్వసభ్య సమావేశం

షాబాద్, ఏప్రిల్ 5: నేడు షాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అపర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖల డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

## భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు



కడ్తాల్, ఏప్రిల్ 5: మండల కేంద్రంతో పాటు పరిధిలోని రావిచేడ్, న్యామతాపూర్, మక్తమాదారం, సాలార్‌పూర్, చరికొండ గ్రామాల్లో రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని (జమాత్– ఉల్– విదా) పురస్కరించుకొని ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కడ్తాల్ పట్టణంలోని మసీద్ ఖుబా, మసీద్ ఆర్షద్‌లో ఇమామ్‌లు జహీరుద్దీన్, మహ్మద్ తాజీబ్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఖురాన్ పఠనం, నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, అహ్మద్‌జానీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావిద్, మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, గౌస్, ఇర్షాద్, వాహబ్, మహబూబ్‌అలీ, షకీల్, ఇద్రీస్, మేరాజ్, అమేర్, యూసుఫ్, నిజాం, ఇమ్రాన్, ఆష్రఫ్, మోహిన్, యూనుస్, నదీమ్ పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** రంజాన్‌మాసం చివరి శుక్రవారం నమాజును ఆమనగల్లు మండల కేంద్రంలోని జామియా మసీదు, మహ్మదీయ మసీదు, హమదే హిలాల్ మసీదుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో ఆయా మసీదుల అధ్యక్షులు మహ్మద్ మాసూం, గౌస్ మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రీ, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, మెకానిక్ బాబా, జబ్బార్, ఖలీల్, రజాక్, నయూమ్, షర్ఫుద్దీన్, ఆల్తఫ్, మహబూబ్, ఫారుక్, అలీం, షరీఫ్, కలీం, అజీమ్, హఫీజ్, ఇమ్రాన్ ఉన్నారు.

## యువతి అదృశ్యం

వెంగళరావునగర్, ఏప్రిల్ 5: పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతూ సర్వీస్ హోంలో ఆశ్రయం పొందుతున్న యువతి అదృశ్యమైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లోని స్టేట్‌హోం ఆవరణలో ఉన్న సర్వీస్ హోంలో ఎ.కల్యాణి(19) సెప్టెంబర్ 2021 నుంచి ఆశ్రయం పొందుతున్నది. ఇదే ఆవరణలో ఉన్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ గవర్నమెంట్ ఉమెన్స్ టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నది. బుధవారం సర్వీస్ హోం హాస్టల్ నుంచి కల్యాణి కనిపించకుండా పోవడంతో సర్వీస్ హోం ఇన్‌చార్జి అమరావతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రోడ్లపైనే చెత్తాచెదారం..

**పట్టించుకోని పారిశుధ్య విభాగం అధికారులు**

**రోడ్లపై చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



తుర్కయాంజాల్, ఏప్రిల్ 5: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు సహకరించాలని అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా కొందరు నిర్లక్ష్యం వీడటం లేదు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు, చెత్తాచెదారాన్ని రోడ్ల వెంబడి పడేస్తుండడంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో రోడ్ల వెంబడి నడిచే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం అధికారులు చెత్తను వేయరాదని బోర్డులను ఏర్పాటు చేయడంతోనే సరిపెడుతున్నారు తప్పా రోడ్ల వెంబడి చెత్తను వేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం పర్యవేక్షణను పెంచి చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజానీకం కోరుతున్నారు.

# ఇఫ్తార్ విందులు.. మతసామరస్యానికి ప్రతీకలు



చేవెళ్లటౌన్, ఏప్రిల్ 5 : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శుక్రవారం రాత్రి చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ముస్లిం సోదరులకు చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్సీ వెంకట్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భారత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, ఎంపీటీసీ రాములు, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌యాదవ్, యాదయ్య, వార్డు సభ్యులు శివకుమార్, వెంకట్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


## ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలి



యాచారం, ఏప్రిల్ 5 : ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చింతపట్ల గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ఉపాధి కూలీల పట్ల కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతున్నదన్నారు. కొన్ని వారాలుగా పనులు చేసినా వారికి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. క్యూబిక్ మీటర్ రేటును పెంచి, కొలతలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. పే స్లిప్పులను చెల్లించి, వారి అకౌంట్లలో డబ్బులు జమ చేయాలని కోరారు. రెండు పూటలా ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. వేసవిలో మౌలిక సౌకర్యం కల్పించి కూలి రేట్లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కూలికీ రెండు వందల పనిదినాలు కల్పించాలని సూచించారు. బీజేపీ సర్కారు మొండి వైఖరి వీడక పోతే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ, ఏప్రిల్ 5: వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. నందిగామ మండలంలోని చేగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు చేంద్రాన్ని గోపాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులు నమ్మి మోసపోవద్దని సూచించారు. నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని అన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 చెల్లిసుందని వివరించారు. ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు తీ ధాన్యాన్ని తీసుకురాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ఎల్బీనగర్ , ఏప్రిల్ 5: తాగునీటి పైప్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేస్తామని జలమండలి అలకాపురి, కొత్తపేట సెక్షన్ల మేనేజర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మోహన్‌నగర్‌లో 'తాగునీరు కలుషితం … ఆందోళనలో ప్రజలు ' శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జలమండలి మేనేజర్ స్పందించారు. మోహన్‌నగర్ గ్రామంలో పొల్యూషన్ వాటర్ సమస్య కాదని, అక్కడ నూతన పైప్‌లైన్, పక్కనే పాత పైప్‌లైన్‌లు ఉండటంతో ఆ ప్రాంతంలో జంక్షన్ నిర్మాణం చేసేందుకు పిట్ తవ్వామని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



యాచారం, ఏప్రిల్ 5: మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మంగలి అలివేలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబానికి చెందిన అలివేలుకు నలుగురు ఆడపిల్లలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన వారికి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు రూ.18,000 నగదును శుక్రవారం అందజేశారు. వారి వెంట రమేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, మల్కాపురం శివశంకర్, శ్రీకాంత్, వీరేశ్, రాజు, మహేందర్ ఉన్నారు.